వాటర్ లాగింగ్ పాయింట్లపై

యాక్షన్ ప్లాన్ రూపొందించండి

ఐటీ కారిడార్‌లో పలు ప్రాంతాలను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్



డీఎల్ఎఫ్ రోడ్డులో వాటర్ లాగింగ్ పాయింట్‌ను పరిశీలిస్తున్న రొనాల్డ్ రాస్, వెస్ట్ జోనల్ కమిషనర్

గచ్చిబౌలి: వాటర్ లాగింగ్ ప్రాంతాలపై యాక్షన్ ప్లాన్ రూపొందించాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐటీ కారిడార్‌లో పలు చోట్ల వాటర్ లాగింగ్ పాయింట్లను జడ్సీ స్నేహ శబరిష్‌తో కలిసి బయోడైవర్సిటీ జంక్షన్, క్యూమార్ట్, మాదాపూర్ మెయిన్ రోడ్డు, బొటానికల్ గార్డెన్, డీఎల్ఎఫ్ రోడ్డు తదితర ప్రాంతాలలో వాటర్ లాగింగ్ పాయింట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరద నీరు రోడ్లపై నిలిచిపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటుందని ఆయన తెలిపారు. వరద నీరు సజావుగా ప్రవహించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో భారీ వర్షాలు కురిస్తే జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరద నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. వర్షం వచ్చిందంటే వాహనాల రాకపోకలు ఆలస్యంగా సాగడంతో ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తుందని పేర్కొన్నారు. కాగా గురువారం కురిసిన భారీ వర్షానికి మాదాపూర్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ఐటీ కారిడార్ గ్రిడ్ లాక్ అయ్యింది. ఈ కార్యక్రమంలో వెస్ట్ జోనల్ డిప్యూటీ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, శేరిలింగంపల్లి సర్కిల్ ఉప కమిషనర్ రంజనీకాంత్ రెడ్డి, ఈఈ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ మాస్టర్ ఆఫ్ సైన్స్(ఎంఎస్) కోర్సు ప్రారంభం

మొదటి బ్యాచ్ ఆగస్టు నుంచి ప్రారంభం

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో పార్ట్‌టైమ్ మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్) కోర్సును ప్రారంభించినట్లు శుక్రవారం ప్రకటించారు. అధునాతన పరిశోధన నైపుణ్యాలను పెంపొందించడానికి, సాంకేతికత నేతృత్వంలోని ఆవిష్కరణలను నడపడానికి రూపొందించడింది. అంతేకాకుండా టెక్‌లడ్‌ను నడపడానికి వ్యక్తులను శక్తివంతం చేయడానికి వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం పరిశోధన ద్వారా పార్ట్‌టైమ్ పరిశ్రమ ప్రయోజిత మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎంఎస్)ను ప్రారంభించారు. ఈ కోర్సు మొదటి బ్యాచ్ ఆగస్టు నుంచి ప్రారంభమవుతుంది. ఈ కోర్సును థీసిస్‌కు అవసరమైన పునాది పరిజ్ఞానంతో పాటు కొన్ని కోర్సులు తీసుకోవాల్సి ఉంటుంది. బల్క్ రిజిస్ట్రేషన్‌తో కంపెనీలు సాంకేతిక రంగాలు, సలహాదారులను ఎంచుకోవచ్చు. అలాగే కంపెనీకి అవసరమైన నిర్దిష్ట పరిష్కారాలపై దృష్టి సారించి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌తో ప్రాజెక్టులను సహా సృష్టించవచ్చు. సైన్స్/ ఇంజినీరింగ్, డిగ్రీ, కనీసం ఒక సంవత్సరం టెక్ ఇండస్ట్రీ అనుభవం ఉన్న ప్రొఫెషనల్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. పాల్గొనేవారు ప్రతి సెమిస్టర్‌లోని వ్యక్తిగత కోర్సులను ఎంచుకోవచ్చు. థీసిస్ ప్రాజెక్టుతో పాటు మూడేళ్లలో ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లో పూర్తి సమయం విద్యార్థులతోపాటు నమోదు చేసుకోవచ్చు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పిజే నారాయణన్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో సాంకేతిక పరిజ్ఞానంలోనైన ముగింపులో నైపుణ్యం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ థీసిస్-ఓరియంటెడ్ కోర్సు ద్వారా హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల ఉద్యోగులు తమ నైపుణ్యాన్ని పొందేందుకు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ సౌకర్యాన్ని కల్పించాలనుకుంటోందన్నారు. ఈ ప్రత్యేకమైన పరిశ్రమ-విద్యా సహకారం కంపెనీలకు బలాన్ని సద్వినియోగం చేసుకోవడానికి అవకాశాలను అందిస్తుందన్నారు. సాధారణ విద్యార్థుల మాదిరిగానే అదే పరిశోధన సమూహాలతో కలిసి పనిచేయడం ద్వారా పరిశోధనపై మాస్టర్స్ స్థాయి అవగాహనను పొందేందుకు నిపుణు ఉంటారని, దరఖాస్తులు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు



రాజీవ్ గృహ కల్ప సముదాయంలో జన్మదిన వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్



షిర్డీసాయి వృద్ధాశ్రమంలో జన్మదిన వేడుకలు చేసుకుంటున్న రవికుమార్‌యాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ రాజీవ్ గృహ కల్ప సముదాయంలో బీజేపీ నాయకులు ఎం.రవి కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలను ఘనంగా శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకలకు మాజీ ఎమ్మెల్యే భిక్షపతియాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాఘవేంద్ర రావు, ఎల్లేష్, రమేష్, రాజేష్ గౌడ్, అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

షిర్డీసాయి వృద్ధాశ్రమంలో...

మియాపూర్: చందానగర్‌లోని దీప్తీశ్రీనగర్ షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ వేడుకలకు హాజరై వృద్ధాశ్రమంలో అభిమానులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్‌కట్ చేసి వృద్ధులకు స్వీట్లు, పండ్లు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాఘవేందర్‌రావు, ఎల్లేష్, రమేష్, రాజేష్‌గౌడ్, అశోక్, రవి ముదిరాజ్, శ్రీనివాస్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రుచులలో అమృతం

ఆవకాయ

● ప్రతి ఇంట్లోనూ పచ్చడి సందడి ● పచ్చడికాయలకు కేరాఫ్‌గా నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు



నల్లగండ్ల కూరగాయల మార్కెట్‌లో పచ్చడి మామిడి కాయల విక్రయాల దృశ్యాలు



పచ్చడి మామిడి కాయలు కట్ చేస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: మామిడికాయ పచ్చడికి తెలుగు రాష్ట్రాలలో ఎంతో ప్రాముఖ్యత ఉంది. తెలుగు వారు ఎక్కడ ఉన్నా ఎన్ని కూరగాయలు, పప్పులు ఉన్నా పచ్చడిలో మామిడి కాయ ఆ ప్రత్యేకతే వేరు. 'వేడివేడి అన్నంలో కొద్దిగా నెయ్యి వేసుకొని ఆవకాయ పచ్చడితో తింటే ఆ రుచే వేరులే' అనే అభిప్రాయం రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతి ఇంట్లో ఎప్పుడూ వింటుంటాం...చూస్తుంటాం. మామిడికాయలు, నూనెలు, ఇతర వస్తువుల ధరలు ఎలా ఉన్నా పచ్చడి పెట్టడం అనేది సామాన్య, మధ్యతరగతి వారి నుంచి అందరి ఇళ్ళలోనూ పెట్టే ఏటా జరిగే తంతుగా మారింది. ముఖ్యంగా ఆవకాయల్లోనూ రకరకాలుగా రుచులతో పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. అందుకే మే రెండో వారం నుంచి క్రయవిక్రయాలు ఆరంభం అయినా చివరి వారం, జూన్ మొదటి, రెండు వారాల్లో ముఖ్యంగా వీకెండ్స్‌లోనే వీటి విక్రయాలు జోరుగా సాగుతుంటాయి.

పచ్చడి కాయలకు కేరాఫ్ అడ్రస్‌గా నల్లగండ్ల, తారానగర్ మార్కెట్..

◆ శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల మార్కెట్, తారానగర్ మార్కెట్‌లలో ప్రతి ఏటా మే, జూన్ నెలల్లో పచ్చడి మామిడి కాయల విక్రయాలు జోరుగా సాగుతాయి. నల్లగండ్ల, తారానగర్ మార్కెట్‌లకు బాటసింగారం మార్కెట్, శంషాబాద్, జహీరాబాద్ తోటల నుంచి వివిధ రకాల కాయలు తీసుకవచ్చి విక్రయించడం ఏటా చేస్తుంటారు. దీంతో ఈ రెండు మార్కెట్లు గత కొన్ని దశాబ్దాలుగా ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. దీంతో పచ్చడి మామిడికాయలకు కేరాఫ్ అడ్రస్‌గా నల్లగండ్ల, తారానగర్ మార్కెట్లు మారాయి. ఇక్కడ జలాలు, నాటు కాయలు, తెల్ల గులాబీలు, నాటుకాయలు, సువర్ణరేఖ, దేశవాళీ, ఆంధ్రా తెల్లగులాబీలు, రసాలు, పచ్చడి మామిడికాయ సైజును బట్టి విక్రయాలు సాగుతుంటాయి. మామిడి కాయలు కొనుగోలు చేయగానే నల్లగండ్ల, తారానగర్ మార్కెట్స్‌లో కట్ చేసేందుకు అందుబాటులో కూడా కొన్ని దశాబ్దాలుగా ఉంటున్నారు. కాయ సైజ్‌ను బట్టి రూ. 3ల నుంచి రూ.5 ల వరకు తీసుకొని కట్ చేసి ఇస్తుంటారు.

వర్షాకాలం ఆరంభమయ్యే వారం ముందు నుంచి విక్రయాలు



ప్రతియేటా వర్షాలు ఆరంభమయ్యే వారం ముందు నుంచి మామిడి పచ్చడికాయల విక్రయాలు జోరుగా సాగుతాయి. బాటసింగారం మార్కెట్ నుంచి ఎప్పటికప్పుడు తాజా కాయలు తీసువస్తున్నాం. పచ్చడి కాయలు తీసుకునేందుకు బాగానే వస్తున్నారు. ప్రతి యేటా సెలవు రోజుల్లో వ్యాపారం బాగా సాగుతుంది. – యశోద, పచ్చడి మామిడి కాయల వ్యాపారి, నల్లగండ్ల

వైభవంగా కుంకుమార్చన



కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీహెచ్‌ఈఎల్ టౌన్‌షిప్‌లోని వేంకటేశ్వర, యోగేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం మహాలక్ష్మి, గోదాదేవి అమ్మవార్లకు 108కిలోల కుంకుమ, పసుపులతో ప్రత్యేక అర్చన నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణమాచార్యులు మాట్లాడుతూ శనివారం బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

హుండీ లెక్కింపు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని రుద్రారం గ్రామపంచాయతీ పరిధి గణేష్ గడ్డ దేవస్థాన హుండీ కానుకలను శుక్రవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజు ఆధ్వర్యంలో లెక్కించారు. 61 రోజులకు గాను రూ.14.03 లక్షలు, అదేవిధంగా అన్నదానం ద్వారా లక్ష రూపాయల ఆదాయం వచ్చినట్లు ఈఓ మోహన్ రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు మల్లికార్జున్ రెడ్డి, ఈశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్ స్వామి, చంద్రశేఖర్, అయ్యప్ప, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బిటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులకు అడ్మిషన్లు షురూ

● ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పణకు 20 చివరి తేదీ
● 'మనూ' సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని కంప్యూటర్ సైన్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగం(సీఎస్‌ఐటీ) ద్వారా బిటెక్, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులలో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైందని 'మనూ' సీఎస్ అండ్ ఐటీ విభాగం అధిపతి ప్రొఫెసర్ ప్రదీప్‌కుమార్ శుక్రవారం తెలిపారు. యూనివర్శిటీలో ఈ విభాగాన్ని 2011లో ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రస్తుతం డిపార్ట్‌మెంట్ ప్రవేశ ఆధారిత రెగ్యులర్ బిటెక్, ఎంటెక్‌లో ప్రవేశానికి దరఖాస్తులను స్వీకరిస్తోందన్నారు. లాటరల్ ఎంట్రీ ఎంసీఏ, ఎంటెక్, పీహెచ్‌డీ కోర్సులకు ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులను సమర్పించడానికి మే 20 చివరి తేదీగా నిర్ధారించడం జరిగిందన్నారు. బిటెక్ కోసం తీసుకొనే సామర్థ్యం 60 సీట్లు, బిటెక్ (లాటరల్ ఎంట్రీ)లో 8 సీట్లు, ఎంటెక్ (కంప్యూటర్‌సైన్స్) 30 సీట్లు, ఎంసీఏలో కూడా 30 సీట్లు ఉంటాయన్నారు. అయితే ఎంసీఏ (లాటరల్ ఎంట్రీ) లభ్యతకు లోబడి పరిమిత సీట్లు కలిగి ఉంటాయన్నారు. ఉర్దూ యూనివర్శిటీ నుంచి ఈ ప్రొఫెషనల్ కోర్సులలో ఉత్తీర్ణులైన ఆరికి ఉపాధి పొందడంలో విజయం సాధించినవారు చాలా మంది ఉన్నారన్నారు.

◆ ఆన్‌లైన్‌లో దరఖాస్తు ఫారమ్‌లు, ప్రాస్పెక్టస్‌లను యూనివర్శిటీ వెబ్‌సైట్‌లో అందుబాటుల ఉన్నాయన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నెంబర్ 9866802414, 040- 23120600 (ఎక్స్‌టెన్షన్- 3603, 3610)లో సంప్రదించాలని సూచించారు.

సమాజ నిర్మాణంలో యువత పాత్ర కీలకం



శ్రీకృష్ణ జయంతి కార్యక్రమంలో శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వి.జగదీశ్వర్ గౌడ్

శేరిలింగంపల్లి: సమాజ నిర్మాణంలో యువకుల పాత్ర కీలకమైందని కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి, శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకులు వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు. శుక్రవారం నల్లగండ్లలో శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ శ్రీకృష్ణ యూత్ అసోసియేషన్ ద్వారా 1998 నుంచి ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు చూరగొనడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బాలరాజు ముదిరాజ్, అధ్యక్షులు ఆదిత్య ముదిరాజ్, ప్రతినిధులు ప్రదీప్, భాస్కర్, జయసాయి, మధుయాదవ్, శివానంద్‌రెడ్డి, సాయిరాజ్, సతీష్, నియోజకవర్గ నాయకులు రామారావు, చంద్రారెడ్డి, రాజిరెడ్డి, గోపాల్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

విద్యుత్ మరమ్మతుల కారణంగా నిలిపివేస్తున్నట్లు అధికారుల వెల్లడి



శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా 33/11 కేవీ నల్లగండ్ల సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను శనివారం నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకటనారాయణ రెడ్డి తెలిపారు.

◆ 11 కేవీ నల్లగండ్ల హుడా పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు నల్లగండ్ల హుడా, రత్నదీప్ సూపర్ మార్కెట్ వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు

◆ 11 కేవీ లక్ష్మీవిహార్ ఫీడర్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు డాక్టర్స్ కాలనీ, నల్లగండ్ల విలేజ్, లక్ష్మీవిహార్ ఫేజ్-1, ఫేజ్ 2 కాలనీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

◆ 11 కేవీ మంజీర ఫీడర్ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు మంజీర అపార్ట్‌మెంట్స్, వజ్రం విల్లాస్, గోపన్‌పల్లి తండాల్లో విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

◆ 11 కేవీ ఎఫిస్టిమో ఫీడర్ పరిధిలో ఉదయం 8 గంటల నుంచి 8.30 గంటల వరకు ఎఫిస్టిమో స్కూల్, సాధన స్కూల్ బ్యాక్ సైడ్ ఏరియాల్లో, తెల్లాపూర్ రోడ్డులో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.

తారానగర్ పరిధిలో..

◆ 11 కేవీ బాపూనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 6 గంటల నుంచి 6.30 గంటల వరకు బాపూనగర్, ఆదర్శనగర్, ఓల్డ్ ముంబాయి హైవే, డోయన్స్ కాలనీ వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తారానగర్ ఏఈ సుమన్ తెలిపారు.

◆ 11 కేవీ రామాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి 7 గంటల వరకు హుడా ట్రేడ్ సెంటర్ కాలనీ, వెంకట్‌రెడ్డి కాలనీ, రైల్ విహార్ కాలనీ, ఓల్డ్ లింగంపల్లి, రైల్వే స్టేషన్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు

మాదాపూర్‌లో..

మాదాపూర్: మాదాపూర్‌లోని పలు ప్రాంతాలలో ఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ అంతరాయం కలుగనుందని విద్యుత్ అధికారులు తెలిపారు. 11కేవీ, 33/11కేవీ ఫీడర్ల పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి 7గంటల వరకు (30 నిమిషాలు) విద్యుత్ అంతరాయం కలుగుతుందని తెలిపారు. అయ్యప్ప సొసైటీ, చంద్రానాయక్‌తండా,, అయ్యప్ప సొసైటీ స్విమ్మింగ్ పూల్, పర్వత్‌నగర్ పరిధిలో ఆటోస్టాండ్, ప్రభుత్వ ఆసుపత్రి, శ్మశానవాటిక, వివేకానందనగర్. అల్లాపూర్ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఉ దయం 8గంటల నుంచి 8.30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. అయ్యప్ప సొసైటీ, హరిహర దేవాలయం, గాయత్రినగర్ ఇండోర్ స్టేడియం, జ్యోతినగర్, శివబస్తీ, తులసీనగర్, సాయినగర్, దుర్గాదేవి ఆలయం, జయిన్‌శంకర్ కన్‌స్ట్రక్షన్, తప స్వీమోటార్స్, మెరీడియన్ స్కూల్ పరిసర ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం కలుగనుందని అధికారులు తెలిపారు.

మియాపూర్‌లో...

మియాపూర్: లక్ష్మీనగర్, రెడ్డికాలనీ, రాంనరేష్‌నగర్, బోకరాజు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరీశ్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 6 గంటల నుంచి 6:30 గంటల వరకు, 6:30 నుంచి 7 గంటల వరకు రెడ్డికాలనీ, బీకేఎన్‌క్లేవ్, ఉదయం 7 గంటల నుంచి 7:30 గంటల వరకు రాంనరేష్‌నగర్, 7:30 నుంచి 8 గంటల వరకు బోకరాజు రంగరాజు కళాశాల రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

హఫీజ్‌పేట్‌లో..

హఫీజ్‌పేట్: హఫీజ్‌పేట్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ఇంద్రసేనారెడ్డి పేర్కొన్నారు. వసంత సిటీ ఫీడర్ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7.00 గంటల వరకు సుభాష్‌చంద్రబోస్ నగర్, ఆదిత్యనగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అదే విధంగా మాతృశ్రీ ఫీడర్ పరిధిలో ఉదయం 6.30 గంటల నుంచి ఉదయం 7.00 గంటల వరకు మాతృశ్రీ నగర్ ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆదిత్యానగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 8.00 గంటల నుంచి ఉదయం 9.00 గంటల వరకు ఫ్రెండ్స్ ఫంక్షన్ హాల్, గల్లీ నెంబర్ 7 నుంచి 14 వరకు, కృష్ణ నగర్ కాలనీ, సుభాష్ చంద్ర బోస్ నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

గచ్చిబౌలిలో..

గచ్చిబౌలి: కొండాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం ఉదయం 7 గంటల నుంచి 7.30 గంటల వరకు పీజేఆర్‌నగర్, రోలింగ్ హిల్స్ విల్లాస్, రాజీవ్ నగర్, అంజయ్యనగర్ పరిసరాల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

◆ కొండాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 7.30 గంటల నుంచి 8 గంటల వరకు ఖానామెట్, ఓయూకాలనీ, రాఘవేంద్రకాలనీ బీ.సీబ్లాక్స్, హైటెక్స్ రోడ్ వంటి ప్రాంతాలలో అంతరాయం కలుగుతుందని ఏఈ తెలిపారు.

◆ కొండాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 8.30 గంటల నుంచి 9 గంటల వరకు శ్రీరామ్‌నగర్ సీ బ్లాక్, కళాజ్యోతి, మసీదుబండ, సీఎంసీ లేఅవుట్, హనుమాన్‌నగర్, ఇజ్జత్‌నగర్, జేవీజీ హిల్స్ పరిసర ప్రాంతాలలో సరఫరాను నిలిపివేస్తున్నట్లు ఆయన వివరించారు.

మార్కెట్‌లోకి సరికొత్త మారుతి స్విఫ్ట్ కారు

సినీనటి కావ్య కళ్యాణ్‌రామ్ చేతుల మీదుగా ఆవిష్కరణ




మారుతి స్విఫ్ట్ కారును మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న సినీ నటి కావ్యకళ్యాణ్‌రామ్

రాయదుర్గం: కొండాపూర్‌లోని జెమ్ మోటార్స్ షోరూమ్‌లో మారుతి సరికొత్త స్విఫ్ట్ కారును శుక్రవారం సినీ నటి కావ్య కళ్యాణ్‌రామ్ చేతుల మీదుగా మారుతి సుజుకి ఇండియా కమర్షియల్ బిజినెస్ హెడ్ సురేష్‌బాబు, రీజనల్ మేనేజర్ బిక్రమ్‌సతాపతితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనకు మారుతి కార్లు అంటే ఎంతో ఇష్టమన్నారు. మారుతి కార్లు బెస్ట్ మెంటనెన్స్ ఫ్రీ కార్లని, ఎక్కువ మైలేజ్‌ను కూడా ఇస్తాయన్నారు. జెమ్ మోటార్స్ మేనేజింగ్ డైరెక్టర్ రాజుయాదవ్ మాట్లాడుతూ కొండాపూర్‌లోని జెమ్ మోటార్స్ షోరూమ్‌లో ఈ కొత్త స్విఫ్ట్‌ని మార్కెట్‌లోకి విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. కొత్త స్విఫ్ట్‌లో ఆరు ఎయిర్ బ్యాగ్స్ స్టాండర్డ్‌గా అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీఈఓ కల్పనారావ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కౌంటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు

రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ లోకేష్ కుమార్



లోకేష్ కుమార్‌కు వివరాలు తెలియజేస్తున్న కలెక్టర్ క్రాంతి

పటాన్‌చెరు టౌన్: జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపునకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ఎన్నికల అదనపు కమిషనర్ లోకేష్ కుమార్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ క్రాంతి, ఎస్పీ రూపేష్‌లతో కలిసి ఆయన గీతం యూనివర్సిటీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూం, కౌంటింగ్ కేంద్రాలను సందర్శించారు. అక్కడ సెక్యూరిటీ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఓట్ల లెక్కింపు సమయంలో ఎలాంటి అవాంతరాలు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేయాలన్నారు. వేర్వేరు మార్గాలలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. ఐడీ కార్డులు లేకుండా ఎవరినీ అనుమతించవద్దని తెలిపారు.

ఎమ్మెల్యే గాంధీని కలిసిన కొండాపూర్ నాయకులు



ఎమ్మెల్యే గాంధీతో కొండాపూర్ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెకపూడి గాంధీని బీఆర్ఎస్ పార్టీ కొండాపూర్ డివిజన్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం ఆయన నివాసంలో కలిసి పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ సరళిపై కొద్ది సేపు చర్చించారు. చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కలిసి పని చేశారని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రమేష్ పటేల్, కరీం, సాంబయ్య, అహ్మద్, హర్షద్, చారీ,జహీర్ తదితరులు పాల్గొన్నారు.

యువతే దేశానికి సంపద

జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా



మాట్లాడుతున్న జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా

పటాన్‌చెరు/ పటాన్‌చెరు టౌన్: యువతే దేశానికి సంపద అని, వారు సమగ్రత, సానుభూతి, నైతిక నాయకత్వ సూత్రాలకు కట్టుబడి ఉండాలని జాతీయ మానవ హక్కుల కమిషన్ ఛైర్మన్ జస్టిస్ అరుణ్ కుమార్ మిశ్రా సూచించారు. శుక్రవారం గీతం ప్రాంగణంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు కిన్నెరా సెమినార్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీలను అందుకుంటున్న విద్యార్థులను అభినందించారు. ఇందులో భవిష్యత్‌ను రూపొందించడంలో వారి పాత్ర, ప్రాముఖ్యతల గురించి వివరించారు. పబ్లిక్ పాలసీ ద్వారా న్యాయం, ధర్మం, ఉమ్మడి ప్రయోజనాలు కొనసాగించాలని, యువత తీసుకునే నిర్ణయాలు, వారు సమర్థించే విధానాలు, చర్యలు అసంఖ్యాక వ్యక్తుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. అందరికీ హక్కులను కల్పించడంలో భారత రాజ్యాంగం పాత్ర, వివిధ కార్యక్రమాల ద్వారా విభిన్న వ్యక్తులను భాగస్వాములను చేయడంలో జాతీయ మానవ హక్కుల కమిషన్ చేస్తున్న ప్రయత్నాల గురించి తెలిపారు. అనంతరం గీతం అధ్యక్షుడు శ్రీభరత్ పట్టభద్రులను అభినందించి, ముఖ్య అతిథిని సత్కరించారు.

ఒకరి ప్రాణం తీసిన మద్యం మత్తు

కారుతో ఢీకొట్టిన ఘటనలో ఒకరి మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

మాదాపూర్: మద్యం మత్తులో కారును నిర్లక్ష్యంగా నడపడంతో ఒకరు మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం తెల్లవారుజామున మాదాపూర్‌లో నివాసముంటున్న దారు శ్రీనివాస్ (35) రోడ్డు పక్కన పాలు అమ్ముతున్నాడు. అక్కడే పాల లోడింగ్ కోసం టాటాఎస్ వాహనాన్ని (టీఎస్08యుజే4466) రోడ్డుపై నిలిపి రాఘవులు నిలబడ్డాడు. అదే సమయంలో రాజేశ్ (39) మద్యం మత్తులో కియా కార్నివాల్ (టీఎస్ 09 ఎఫ్ఎస్ 4499) కారులో హైటెక్ సిటీ నుంచి జూబ్లీహిల్స్ వైపునకు అతివేగంతో నిర్లక్ష్యంగా వాహనాన్ని నడుపుతూ రోడ్డు పక్కన నిల్చున్న శ్రీనివాస్, పక్కనే ఉన్న రాఘవులపై కారుతో దూసుకెళ్లాడు. దీంతో శ్రీనివాస్, రాఘవులకు తీవ్రగాయాలపాలయ్యారు. వెంటనే స్థానికులు సమీప ఆసుపత్రికి తరలించగా శ్రీనివాస్ చికిత్సపొందుతూ మృతి చెందా డు. రాఘవులు గాయాలతో చికిత్స పొందుతున్నాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా సంఘటనా స్థలానికి చేరుకొని సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భూ కబ్జాలను అడ్డుకోవాలి

జిన్నారం(పటాన్‌చెరు): బొల్లారం మున్సిపల్ పరిధిలో ప్రభుత్వ భూముల కబ్జాలను అడ్డుకోవాలని కౌన్సిలర్ గోపాలమ్మ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూములను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొల్లారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో అక్రమార్కులు రాత్రికి రాత్రి ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. తక్షణమే అధికారులు స్పందించి ప్రభుత్వ భూములను రక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

యువకుడి అదృశ్యం



జిన్నారం(పటాన్‌చెరు): యువకుడు అదృశ్యమైన సంఘటన గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లిలో చోటుచేసుకుంది. ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఒడిస్సా రాష్ట్రానికి చెందిన రాహుల్ మోరియా (29) బొంతపల్లిలో 10ఏళ్లుగా తల్లిదండ్రులతో కలిసి నివాసం ఉంటున్నాడు. బైక్ మెకానిక్‌గా పనిచేస్తున్న మోరియా ఈ నెల 6వ తేదీన తిరుపతికి వెళ్తున్నానని చెప్పి వెళ్లి ఇప్పటివరకు ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద మోరియా కోసం వెతికినా సమాచారం లభించలేదు. రాహుల్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

స్వచ్ఛందంగా సినిమా థియేటర్ బంద్

పటాన్‌చెరు: సినిమా థేయేటర్ల అసోసియేషన్ పిలుపు మేరకు పటాన్‌చెరు డివిజన్‌లోని ఎస్వీ స్కేర్ సినిమా థియేటర్ యాజమాన్యం స్వచ్ఛందంగా బంద్ చేసింది. ఒకటే స్క్రీన్ సినిమా థియేటర్లకు ప్రేక్షకులు రావడంలేదని, ప్రభుత్వం రాయితీలు ప్రకటించాలని ఆయా సినిమా థియేటర్ల యాజమాన్యాలు డిమాండ్ చేస్తున్నాయి. ఓటీటీ, కార్పొరేట్ మల్టీప్లెక్స్‌లు వచ్చిన తర్వాత చిన్న థియేటర్లను మూసి వేసుకునే పరిస్థితి ఏర్పడిందని, ప్రేక్షకులు రాకపోవడంతో కనీసం కరెంట్ బిల్లులు కూడా చెల్లించడం ఇబ్బందిగా మారిందని నిర్వాహకులు వాపోతున్నారు. జూన్ 1వ తేదీ వరకు ఎస్వీ స్కేర్ సినిమా థియేటర్‌ను బంద్ చేయనున్నట్లు యాజమాన్యం తెలిపింది.

త్వరలోనే బొల్లారం మున్సిపాలిటీ విలీనం

జిన్నారం(పటాన్‌చెరు): గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం మున్సిపాలిటీ త్వరలో విలీనం కానుందని, దీంతో బొల్లారం మరింత అభివృద్ధి చెందుతుందని మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ వెస్ట్ జోన్‌లో బొల్లారం విలీనం కానుందని అని తెలిపారు. విలీన ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.